క్లుప్తంగా

కూరగాయల మార్కెట్ తరలించొద్దు



నిరసన తెలుపుతున్న వ్యాపారులు

వేములవాడ: కరోనా సమయంలో తాత్కాలికంగా బైపాస్ రోడ్డులోని గంగమ్మ గుడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను తొలగించవద్దంటూ ఇక్కడి వ్యాపారులు బుధవారం ఆందోళనకు దిగారు. కొద్ది రోజులుగా ఇక్కడ దుకాణాలు పెట్టొద్దంటూ మున్సిపల్ అధికారులు చెబుతున్నారని, రోడ్డును ఆనుకుని ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్న మార్కెట్‌ను ఎందుకు తరలిస్తున్నారని, ఇలా తమల్ని మూడుసార్లు తరలించారని దీంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రూ.2.50 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులోకి వెళ్లాలంటూ మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు. వీరికి సీపీఐ నాయకులు కడారి రాములు, ఎల్లా దేవరాజు, గాజుల పోచెటి, పెంట మల్లయ్య, కోర క్రాంతి, పెంట శ్రీనివాస్, మహిళా సంఘం నాయకులు కోకపల్లి శాంత తదితరులు సంఘీభావం ప్రకటించారు. గంగమ్మ గుడి ప్రాంతంలోనే తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి కూరగాయల రైతులకు సహకరించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి



కమిషనర్‌కి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: మున్సిపల్ పరిధి పెద్దూరులోని 8, 9వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పెద్దూరులో డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణం తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. 8వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు మెడుదుల దేవయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు ముష్కం దేవయ్య, ఉపాధ్యక్షుడు విడుగురాళ్ల బాలరాజ్‌గౌడ్, తమ్మిటి జమీన్, సలేంద్రి ఎల్లయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గంభీరావుపేట/రుద్రంగి: గంభీరావుపేట మండలం లింగన్నపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వే నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వాడకం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, ఐకేపీ సీసీ సురేందర్, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. రుద్రంగిలో ఏఎన్ఎం, ఆశా టీమ్ ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు.

వంతెన నిర్మాణమెప్పుడో.?

- శిథిలమైన బోయినపల్లి–కొదురుపాక వంతెన
- చెడిపోయిన కల్వర్టుతో పొంచి ఉన్న ప్రమాదం
- డబుల్ రోడ్డులో సింగిల్ లేన్ కల్వర్టు
- పలుచోట్ల కుంగిన కల్వర్టు
- నిత్యం భారీ వాహనాల రాకపోకలు
- వానకాలం గడవడం గగనమే



కల్వర్టు వద్ద గతేడాది దిగబడ్డ లారీ (ఫైల్)



కల్వర్టు పక్క కయ్యపై పోసిన మొరం



గతేడాది కల్వర్టు మీదుగా నీటి ప్రవాహం (ఫైల్)

బోయినపల్లి: బోయినపల్లి–కొదురుపాక డబుల్ రోడ్డులో శిథిలమైన కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ఎదురుచూపు తప్పడం లేదు. బోయినపల్లి పెట్రోల్ బంక్ పరిసరాల్లో ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమై ఏళ్లు గడుస్తోంది. గతేడాది కురిసిన వర్షాలకు కల్వర్టు చివరలో పలుచోట్ల కుంగి కయ్య పడింది. ఇపుడు కయ్యలో మొరం పోసి కనపడకుండా చేశారు. ఐతే మళ్లీ గట్టి వర్షం పడితే మొరం కొట్టుకుపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. 1970 ప్రాంతంలో వంద మీటర్ల మేర నిర్మించిన కల్వర్టు కింద నీరు నిల్వ ఉండంతో కట్టడం బలహీనపడింది. అలాగే వరద నీరు వెళ్లే ప్రాంతంలో స్లాబ్ కొట్టుకుపోయింది. ఐదేళ్ల క్రితం రూ.10 కోట్ల అంచనాలతో బోయినపల్లి నుంచి కొదురుపాక వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మించారు. కాని కల్వర్టును మాత్రం పట్టించుకోలేదు. డబుల్ రోడ్డు నిర్మించిన సమయంలో ఈ కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జికి అధికారులు అంచనాలు వేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని పలువురు అంటున్నారు.

నిత్యం భారీ వాహనాల రాకపోకలు

ఈ కల్వర్టుపై రోజూ వాహనాలు రాకపోకలు నిరంతరం కొనసాగుతాయి. భారీ లోడుతో గ్రానైట్, ఇసుక, కంకర తదితర సామాగ్రి గల 10 టైర్, 12 టైర్ లారీలు ప్రయాణం చేయడంతో కల్వర్టు చివర శిథిలావస్థకు చేరింది. గతేడాది సెప్టెంబర్‌లో కొదురుపాక మీదుగా సిరిసిల్లకు వెళ్తున్న 25 టన్నుల ఆలుగడ్డ లోడ్‌తో ఉన్న లారీ కల్వర్టు చివర్లో దిగబడి ఒకవైపు వంగింది. దీంతో కల్వర్టు కింద ఉన్న రౌతు కట్టడం కూలిపోయి కుంగింది. అప్పుడు భారీ ప్రమాదం తప్పింది. లారీని తీయడానికి చాలా కష్టపడ్డారు. ఇలా కల్వర్టు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిధుల కోసం ఎదురుచూపు

కల్వర్టు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి గతేడాది తీసుకెళ్లారు. కాగా ఏడాది దాటినా నిధులు మంజూరు కాలేదు. దీంతో మరో వర్షాకాలం వచ్చింది. బ్రిడ్జీపై వర్షాకాలం ఎలా గడుస్తుందా అని పలువురు భయపడుతున్నారు.

నిధుల మంజూరులో అలసత్వం



కల్వర్టు ఉన్న ప్రదేశంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో అలసత్వం ఎందుకో అర్థం కావడం లేదు. కల్వర్టు కింద రౌతు కట్టడాలు కూలి కల్వర్టు కుంగింది. కల్వర్టు ఎంట్రెన్స్‌లో పెద్ద కయ్య పడితే మొరంతో పూడ్చారు. మళ్లీ వర్షం పడితే అది కొట్టుకుపోయింది. – అలువాల అజయ్

కల్వర్టుపై ప్రయాణం భయం



వర్షం కురిసిన రోజు నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో కల్వర్టు మీదుగా రాకపోకలు నిలిపి వేస్తారు. గతేడాది చాలాసార్లు కల్వర్టు మీదుగా భారీగా నీరు ప్రవహించింది. వానకాలంలో ఈ తిప్పలు ఎప్పుడూ ఉంటుంది, శిథిలమైన కల్వర్టు మీదుగా ప్రయాణం చేయాలంటే భయంగా ఉంది. – బిల్ల గణేశ్, బోయినపల్లి

భారీ వాహనాల రాకపోకలు



శిథిలమైన కల్వర్టుపై నుంచి నిత్యం ఇటు కొదురుపాక వైపు నుంచి అటు గంగాధర వైపు నిత్యం పెద్ద ఎత్తున గ్రానైట్ బండరాయి లారీలు వెళ్తాయి. ఒక్కో బండరాయి వందల టన్నులు ఉంటుంది. అధిక బరువు గల లారీలు వెళ్లడంతో కల్వర్టు మరింత ఛిద్రం అవుతుంది. త్వరగా హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. – సింగిరెడ్డి బాలమల్లు, నీలోజిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



కల్వర్టు స్థానంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గత సంవత్సరం ప్రతిపాదనలు పంపించాం. కల్వర్టు వంద మీటర్ల పొడవు ఉండడం. వరద నీటి ఉధృతి ఎక్కువ ఉండడంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదించాం. నిధులు మంజూరు చేస్తే పనులు చేయిస్తాం. – ఆర్. సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, బోయినపల్లి

వర్షంలోనూ ఆగని సమ్మె



ఎల్లారెడ్డిపేటలో వర్షంలో సమ్మె చేస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/చందుర్తి: పంచాయతీ కార్మికులు బుధవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వర్షంలో తడుస్తూనే నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య, మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. గంభీరావుపేటలో కార్మికుల సమ్మెకు కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి పిట్ల వెంకటి మద్దతు తెలిపారు. నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గాదం రాందాస్, నర్సయ్య, లక్ష్మి, భారతమ్మ, శంకర్, కార్మికులు పాల్గొన్నారు. చందుర్తిలో పంచాయతీ కార్మికుల సమ్మెకు పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య మద్దతు పలికారు. కార్యక్రమంలో కార్మికులు పోతురాజు రాజేశం, గంధం ప్రదీప్, వాసం కిరణ్, లక్కెబాబు, బింగి రామయ్య, మహంకాళి లచ్చవ్వ పాల్గొన్నారు.

చిత్రకథ



బడిలోకి వెళ్లాలంటే బురద దాటాల్సిందే..

వేములవాడరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చాలా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలు వర్షపు నీటితో బురదమయంగా మారాయి. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. మండలంలోని హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన గేటు వద్ద, ప్రహరీ పక్కన డ్రెయినేజీ లేకపోవడంతో వర్షపు నీరు నిలిచింది. ఆ బురదలో నుంచే నడుస్తూ బడిలోకి వస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

నిర్వాసితుల పెండింగ్ సమస్యల పరిష్కరించాలి

బోయినపల్లి: మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ సమస్యలు ఏళ్లు గడిచినా పరిష్కారం కావడం లేదని మండలంలోని ముంపు గ్రామాల బీజేపీ నాయకులు కొండం శ్రీనివాసరెడ్డి, జనగం లక్ష్మణ్, ఆవుల లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం కొదురుపాకలో విలేకర్లతో మాట్లాడుతూ పెండింగ్ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ గతంలో గ్రామానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించారని తెలిపారు. గ్రామాల్లో స్పెషల్ అధికారులు పర్యటించిన సమయంలో పలువురు పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారని అన్నారు. ప్రత్యేకాధికారులకు పెండింగ్ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చి ఏడాది గడిచినినా సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. ప్యాకేజీ, ఇళ్ల డబ్బులు రాలేదని, పలువురు యువతులకు ప్యాకేజీ రాలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి

కోనరావుపేట: వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తాఫజుల్ హుసేన్, కోనరావుపేట, రుద్రంగి ఎస్సైలు రమాకాంత్, ప్రభాకర్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. వ్యవసాయ రైతులు పొలాల దగ్గర కరెంటు స్తంభాల దగ్గర జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరిగినా, చెరువులు నిండి మత్తడి దుంకిన సమాచారం ఇవ్వాలని, గ్రామాల్లో రోడ్లు తెగే ప్రమాదం ఉంటే గ్రామాల్లో డెలివరీకి దగ్గర ఉన్న గర్భిణులు ఉంటే ఆశ వర్కర్లతో దగ్గరలో వున్న సివిల్ హాస్పిటల్‌లో చేర్పించాలన్నారు. గ్రామాల్లో పాత, కూలిపోయే దశలో ఉన్న ఇళ్లలో ఉండకూడదని సూచించారు. మూలవాగు, పెంటివాగు పరివాహక ప్రాంతం వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తితే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు.

మహిళలకు మొక్కల పంపిణీ

కోనరావుపేట: మండలంలోని కనగర్తి, వట్టిమల్లలో బుధవారం మొక్కలు పంపిణీ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులకు, ప్రతి ఇంటికి సర్పంచ్ కొమ్ము స్వప్న మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు కవిత, జ్యోతి, కొమ్ము దేవరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్‌లో పలువురు లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు.

నేటి నుంచి తంగళ్లపల్లిలో సోషల్ ఆడిట్

తంగళ్లపల్లి: మండలంలో గురువారం నుంచి ఉపాధిహామీ పనుల సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. 2020 డిసెంబర్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.18 కోట్ల ఉపాధిహామీ నిధుల వ్యయంపై సోషల్ ఆడిట్ జరగనున్నట్లు ఏపీవో రాపోలు నాగరాజు తెలిపారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

బోయినపల్లి: బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. స్థానిక సర్పంచ్ లతశ్రీ, పాలకవర్గం డైరెక్టర్లు పాల్గొన్నారు.

బురదమయంగా మారిన పాఠశాల దారి

చందుర్తి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు వెళ్లే దారి చిన్నపాటి వర్షాలకు బురదమయంగా మారిన కాలి నడక నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే మరమ్మతులు చేయాలని పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాలకులను , అధికారులను కోరుతున్నారు. పాఠశాలకు వెళ్లే 500 మీటర్ల దూరంలో రోడ్డు బురదమయంగా మారిందంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆశీర్వాదం మాకే ఉంది

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి



మాట్లాడుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గడప..గడపకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రచారం చేయాలని ఆ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక 30, 31 వార్డుల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ముందంజలో ఉంచారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌నే ఆశీర్వదిస్తారన్నారు. నూతనంగా ఎన్నికైన వార్డు కమిటీలకు నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ రాధ, అగ్గిరాములు, తుమ్మ రాజు, బత్తుల వనజ, సత్తార్, మ్యాన రవి, తదితరులు పాల్గొన్నారు.

కొండూరికి సన్మానం



సిరిసిల్లటౌన్: నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని బుధవారం సిరిసిల్లకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఆయనను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మ్యాన రవి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: క్రీడల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జిల్లా యువ క్రీడల అధికారిగా అజ్మీర రాందాస్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా దేవత ప్రభాకర్ ఎంపికైన సందర్భంగా వారిని ఉపాధ్యాయులు సన్మానించారు. వ్యాయమ ఉపాధ్యాయులుగా ఉన్న వారే అధికారిగా, కార్యదర్శిగా ఎంపికవడం అభినందనీయమన్నారు. ఇరువురి నాయకత్వంలో జిల్లా క్రీడారంగం ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాకాల శంకర్‌గౌడ్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, కుమ్మరి మల్లేశం, ఉత్తమ్ విజయ్‌కుమార్, గుండమనేని మహేందర్‌రావు, దుమాల రమానాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కె.రాజలింగం, రమేశ్, తిరుపతి పాల్గొని అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో రేవంత్‌రెడ్డి

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మాజీ సింగిల్‌విండో చైర్మన్ భూంపెల్లి రాఘవరెడ్డి, రేపాక మాజీ సర్పంచ్ గుర్రం భూపతిరెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో చేరిన వీరికి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్యురాలు వైద్యాధికారిణిలు స్రవంతి, స్నేహ కోరారు. ఆయా పీహెచ్‌సీల్లో బుధవారం వైద్య సిబ్బందితో వారు సమావేశమయ్యారు. నులిపురుగులు ఉన్న పిల్లలు రక్తహీనతతో బాధపడతారన్నారు. ఆశకార్యకర్తలు రెండేళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 20న ఎవరికైనా వేయకుంటే ఈనెల 27న మళ్లీ గుర్తించి వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా ఇస్తారని తెలిపారు. వైద్యులు చిరంజీవి, స్వప్నలత, పీహెచ్ఎన్ రజినీ, సూపర్‌వైజర్‌లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు లాటరీ నేడు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో 1, 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులను గురువారం లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 46 నాన్ రెసిడెన్షియల్, ఐదో తరగతిలో రెసిడెన్షియల్ విభాగంలో 49 సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అందిన దరఖాస్తులను గురువారం ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సమక్షంలో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

21న కుని శిబిరం

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. ఈ క్యాంపులో మగవారికి (ఎన్ఎస్‌వీ) మాత్రమే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేస్తారన్నారు. ఈ ఆపరేషన్ చేయించుకునే వారు ముందుగా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ బ్లాక్ దగ్గర పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

సంఘాలు ఎన్నికలు

యాదవ సంఘం కార్యవర్గం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో రాధాకృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఆసరి బాలరాజు యాదవ్, ఉపాధ్యక్షుడు ఉడుతల నరేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి ఉడుతల శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి బొడ రాజు యాదవ్, ముఖ్య సలహాదారులుగా చౌడవేని వెంకటీ యాదవ్, దుగ్యాని పర్శరాములు యాదవ్, గెండెల్లి నర్సయ్య యాదవ్, నూకల లచ్చయ్య యాదవ్, ఉడుతల బుచ్చయ్య యాదవ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, యాదవ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా మల్లారెడ్డి

ముస్తాబాద్: రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా ఆవునూర్ గ్రామానికి చెందిన కుంబాల మల్లారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చీకోడుకు చెందిన గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా చిప్పలపల్లికి చెందిన ఒలాద్రి ఆగంరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా నామాపూర్‌కు చెందిన కొండం రాజిరెడ్డిని ఎన్నుకున్నారు. రెడ్డి సంఘం బాధ్యులు కనమేని శ్రీనివాస్‌రెడ్డి, అన్నం శ్రీధర్‌రెడ్డి, సందుపట్ల అంజిరెడ్డి, రమేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, వి.విజయలక్ష్మి వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రహారం కళాశాలలో తెలుగు, కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ పోస్టులు రెండు చొప్పున, గంభీరావుపేట డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్–2, కామర్స్–2, తెలుగు, హిస్టరీ పోస్టులు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్ లో పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలతో పాటుగా బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అగ్రహారంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు, గంభీరావుపేటలో 20న సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలని, ఎంపిక ప్రక్రియ 21న ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు.

చిన్నారులకు ఆట వస్తువులు

వేములవాడరూరల్: మండలంలోని బొల్లారం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుకుంటున్న చిన్నారులకు వేములవాడ భాను ఏజెన్సీ యజమాని నగుబోతు రవీందర్ ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మై వేములవాడ ట్రస్టు నిర్వాహకుడు మధు మహేశ్, ప్రతాప నటరాజ్, పొలాస రాజేందర్, వేణు పాల్గొన్నారు.